క్లుప్తంగా

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్వామికి 108 కలశాలతో పంచామృత అభిషేకాలు, దివ్య తిరుకల్యాణ మహోత్సవం, గరుడ వాహనంపై నగర సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముగింపులో భాగంగా స్వామి వారి పుష్పయాగం నిర్వహించారు.

దాతల వితరణ అభినందనీయం



వెంట్రప్రగడ(పెదపారుపూడి): విద్యార్థులకు దాత కాట్రగడ్డ నాగేశ్వరరావు చేస్తున్న నగదు వితరణ అభినందనీయమని హెచ్ఎం కె.కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ హైస్కూల్లో 2023–24 సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత కాట్రగడ్డ నాగేశ్వరరావు సుమారు రూ.30 వేల నగదు చెక్కును గ్రామానికి చెందిన వంకినేని శ్రీరాములు చేతుల మీదగా శుక్రవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వై.హిమబింధు అమూల్య(576)కు రూ.15వేలు, ద్వితీయ స్థానం పొందిన సీహెచ్ రాంచరణ్‌కు రూ.10వేలు, తృతీయ స్థానం సాధించిన కె.ప్రవల్లికకు రూ.5వేలను అందజేసినట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మరో దాత బసవాచారి విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున వితరణగా ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు



గుడివాడ టౌన్: ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా ఆశీర్వదించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విఘ్నేశ్వరుని కోరుకున్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసన సభ్యుడిగా తొలిసారి సభకు హాజరవుతున్న నేపథ్యంలో ఏవిధమైన ఆటంకాలు సంభవించకుండా భగవంతుడి ఆశీస్సులు కోరుతూ ఈ పూజలు చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీగంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

పెదపారుపూడి: మండలంలోని యలమర్రులోని శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి మహిళలు ప్రత్యేక జలాభిషేకాలు చేశారు. అమ్మవారికి పాలపొంగిళ్లు వండి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సూరపనేని సత్యనారయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు మూడు వేల మందికి అన్నసమారధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంకమ్మతల్లికి లక్ష మల్లెల పూజ

పామర్రు: పమిడిముక్కల మండలం గురజలో వేంచేసియున్న జంపాన వారి అంకమ్మతల్లి ఆలయంలో జ్యేష్ఠ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. జంపాన వెంకటర్నం, పద్మావతి కుటుంబ సభ్యులు, స్థానిక భక్తుల చేత లక్ష మల్లెలతో విశేషంగా పూజలను చేశారు. ఆలయంలో అగ్నిహోత్రం కార్తీక్ మంత్రోచ్చారణతో పూజలను చేశామని ఆలయ అర్చకులు రొంపిచర్ల లోకాంత రంగ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జంపాన నాగమణి, జంపాన బాపనయ్య, వీరంకి వెంకటేశ్వరరావు, లేటు పామర్తి వెంకటనారాయణ పాల్గొన్నారు.

పుడమితల్లికి పూజలు

కాజ(మొవ్వ): ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మొవ్వ మండలంలోని రైతులు పుడమితల్లికి పూజలు చేసి సాంప్రదాయ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందని కృష్ణా జిల్లా గోఆధారిత వ్యవసాయం అధ్యక్షుడు పేకేటి సీతారామిరెడ్డి దంపతులు పుడమి తల్లికి, కాడెద్దులకు, నాగలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు ప్రసాద్‌రెడ్డి, నాగేశు, వరదయ్య, నాని, శ్రీను, భాస్కరరావు, చంటి పాల్గొన్నారు.

హెచ్ఎం శేష సాయికుమార్ మృతి



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నెమ్మాని శేష సాయి కుమార్(59) శుక్రవారం వేకువ జామున విజయవాడలోని ఓ ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నెల 19వ తేదీన గుండె సంబంధిత సమస్యతో ఓ ప్రైవేటు హాస్పిటల్లో చేరిన ఆయన శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తోట్లవల్లూరు: యోగాతో మానసిక ప్రశాంతతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణి రాజమోహన్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా వలన కలిగే ఉపయోగాలను ఫణి రాజమోహన్ వివరించటంతోపాటు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఉపాధ్యాయుడు రియాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లులో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్ వద్ద శుక్రవారం ఇంటర్నేషనల్ యోగా డే నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ యోగా వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయన్నారు. రోజంతా మనసు ప్రశాంతంగా ఉండి, చేసే పనిమీద దృఢ సంకల్పం ఏర్పడుతుందని తెలిపారు. ఏ వయస్సు వారైనా యోగాభ్యాసాలు చేయవచ్చని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, మాజీ సర్పంచ్ పుట్టి సత్యనారాయణ, హెచ్ఎం మాధవ కుమార్, యువ కేంద్రం వలంటీర్లు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో 12 పాఠశాలలకు చెందిన విద్యార్థులు యోగా శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ యోగా ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు జ్ఞాపక శక్తిని, ఇంటలెక్చువాలిటీని పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా యోగా అవసరం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం, హోమియో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, యోగా గురువు శ్రీనివాస్, మను సేవా సంఘం ప్రోగ్రామ్ చైర్మన్ కె.రవి, అధ్యక్షుడు సీహెచ్ లీలా శ్రీనివాసరావు, కన్వీనర్ అర్జా ప్రసాదు పాల్గొన్నారు.

● స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

● స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, వ్యాయామ అధ్యాపకుడు వీర్ల గోపి, బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

● స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్బీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గుడివాడ గాయత్రి పరివార్ సహకారంతో యోగా గురువు కేడీవీఎన్ శ్రీనివాస్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఎస్ హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ వి.కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, ఎంఈఓ–2 రత్నసునాథం, టి.వెంకటస్వామి, సత్తిబాబు, రాజే, హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయిబాబా ధ్యాన మందిరం వద్ద యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు టి.బ్రహ్మం, సమయం యేసుబాబు, వేంపాటి విష్ణు, జి.శివ, ఎం సత్తిబాబు, కె.శ్రీనివాసరావు, బి.వెంకయ్య, జి.గణేష్ పాల్గొన్నారు. అయ్యవారిరుద్రవరంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ–2 రత్నసునాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం యోగా తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో పలురకాల ఆసనాలు వేయించారు. వైవాక, పెదపాలపర్రు, పెయ్యేరు, నరసన్నపాలెం, దేవరం, చినకామనపూడి ప్రాథమిక పాఠశాలలతో పాటు పలు పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యం

ఉరుటూరు(పామర్రు): శ్వాసమీద ధ్యాస ఉంచడమే యోగా అని దీనిని ప్రతిరోజూ చేయడం వలన మంచి ఆరోగ్యం కలుగుతుందని పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి పేర్కొన్నారు. మండలంలోని ఉరుటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత పలు రకాల యోగాసనాలను వేయించారు. హెచ్ఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జీవితంలో యోగా ఒక భాగం

కైకలూరు: నిత్య జీవితంలో యోగాను ప్రతిఒక్కరూ ఒక భాగం చేసుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌పీ లక్ష్మి సూచించారు. కైకలూరు కోర్టు ప్రాంగణంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగా అనేది ఎవరి గురించి వారు తెలుసుకునే ఓ ప్రక్రియ అని చెప్పారు. యోగా చేసిన అందరూ ఉత్సాహంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

కైకలూరు పంచాయతీలో..

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు ఆధ్వర్యంలో యోగాపై వెలంపేట పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. యోగా గురువు ఉండ్రమట్ల సాంబశివరావు ప్రత్యేక అతిథిగా విచ్చేసి పలు ఆసనాలు నేర్పారు.



తోట్లవల్లూరులో ధ్యానం చేస్తున్న విద్యార్థులు



వైవాక పాఠశాల్లో యోగా చేస్తున్న విద్యార్థులు



కైకలూరు కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న జడ్జి లక్ష్మి



ఎన్టీఆర్ స్టేడియంలో యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

యోగా గురువు తాతారావుకు ఘన సత్కారం

పామర్రు: పామర్రు వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువు చొక్కపు తాతారావు క్లబ్ సభ్యులతో కలిసి యోగాను చేయించారు. ఆసనాలలో ఉన్న రకాలను వాటి విశిష్టతను వివరించారు. పద్మాసనం, మయూరాసనం, శీర్షాసనం, వజ్రాసనం తదితర ఆసనాలను అందరితో వేయించారు. అనంతరం క్లబ్ సభ్యులు తాతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, కంచర్ల వీర జనార్దనరావు, పరిశ వెంకట నాంచారయ్య, మద్దుల సుబ్రమణ్యం, పరిశ భాస్కరరావు పాల్గొన్నారు.



తాతారావును సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

అంగనవాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి

పమిడిముక్కల: అంగనవాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ పేర్కొన్నారు. హనుమంతపురం అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే, అంగనవాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగనవాడీలో చేర్పించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలపాల రాంబాబు, మహిళా పోలీస్ మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



పమిడిముక్కల: శ్రీ ఆదిశంకరాచార్య వేదిక సేవా ట్రస్ట్(హైదరాబాద్) తరఫున పసుమర్తి ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో ఐనపూరు హైస్కూల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులకు నోట్‌బుక్స్, కిట్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. కూడేరు ప్రాథమిక పాఠశాలలోని ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు నోట్‌బుక్స్, కిట్‌లు అందజేసినట్లు ఆంజనేయశాస్త్రి తెలిపారు. హెచ్ఎం ఎస్ఏకే స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి



పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 2023–24 ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి దాత ప్రోత్సాహక బహుమతిని అందించినట్లు హెచ్ఎం ఇందిరారాణి పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్లో శుక్రవారం విద్యార్థినికి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ స్థానికులు పూటుకూరి చలపతి రావు భార్య పూటుకూరి లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం విద్యార్థిని పెనుమూడి స్నేహితకు రూ.20 వేల విలువగల బంగారు పతకం అందజేసినట్లు పేర్కొన్నారు.

సబ్సిడీ వరి విత్తనాలు సిద్ధం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సార్వా వరి విత్తనాలు సబ్సిడీపై విక్రయించేందుకు సిద్ధం చేసినట్టు మండల వ్యవసాయాధికారి బొర్రా వేణు మాధవ్ శుక్రవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో 350 క్వింటాళ్ల వరి విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో ఎంటీయూ 1061, 1318, స్వర్ణ వంటి రకాలున్నాయని తెలిపారు. వీటిపై కిలోకు రూ.5 సబ్సిడీపై విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఈ రకాల విత్తనాలు 30 కిలోల బస్తాకి సబ్సిడీ పోను రూ.1,044 విక్రయిస్తారని పేర్కొన్నారు.

నీట్ పరీక్షలపై నిగ్గుతేల్చాలి

గుడివాడ టౌన్: నీట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీక్‌లపై విచారణ చేపట్టి నిగ్గుతేల్చాలని ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. స్థానిక నారాయణ, చైతన్య కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్యానాకు చెందిన ఒకే పరీక్ష కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు రావడం, అదికూడా 720/1000 మార్కులు రావడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విధమైన అనేక అవకతవకలు బయటపడినప్పటికీ కేంద్ర ప్రభుత్వం విచారణ జరపకపోవడం, కౌన్సిలింగ్ ప్రారంభించడం దుర్మార్గం అన్నారు. వెంటనే నీట్ పరీక్షలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు పరీక్ష నిర్వహణ బాధ్యతను అప్పజెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సలీమ్, గుడివాడ కార్యదర్శి సమీర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు


అందుబాటులోకి యూరాలజీ వైద్య సేవలు

గుడివాడరూరల్: గుడివాడ ప్రజలకు మునుపెన్నడూ లేనివిధంగా యూరాలజీ వైద్య సేవలను డాక్టర్ యలవర్తి పవన్‌గణేష్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పద్మశ్రీ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే పేర్కొన్నారు. స్థానిక ఏలూరురోడ్‌లో యూరాలజిస్ట్ జనరల్ సర్జన్ డాక్టర్ యలవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ హాస్పిటల్‌ను ఆయన శుక్రవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు యలవర్తి లాంటి యువ వైద్యులు ముందుకు రావడం శుభపరిణామన్నారు. పుట్టిన గడ్డపై వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. జీవితంలో మరింత ఉన్నత ఎత్తుకు డాక్టర్ యలవర్తి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, క్వాలిటీ ఫీడ్స్ అధినేతలు కోగంటి గోపాలకృష్ణ, కోగంటి ఆంజనేయులు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలడుగు వెంకట్రావ్, విశ్వభారతి విద్యాసంస్థల అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణ, అర్బన్‌బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, వైద్యులు మన్నెం భవానీశంకర్, సోమూరి వెంకట్రావ్, వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యం, పాస్టర్ సజ్జా బర్నబాస్, డీఎస్పీ పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

‘బలహీన వర్గాలకు అన్ని వేళలా అండగా ఉంటా’



మాట్లాడుతున్న ఈశ్వర్‌కుమార్

గుడివాడ టౌన్: నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీలు, మైనార్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాను వారికి అండగా ఉంటానని మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గురువారం తాను స్పందించిన వార్తకు ప్రతిగా టీడీపీ నాయకులు మరో పత్రికలో ఐదేళ్లు ఏమయ్యావు ఈశ్వర్ కుమార్ అంటూ ప్రశ్నలు సంధించడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నియోజక వర్గంలో బాధితులకు తాను అండగా నిలిచామన్నారు. సాధారణంగా ప్రతిపక్ష పార్టీలు స్పందించాల్సి ఉండగా టీడీపీ నాయకులు ఎవ్వరూ నోరు విప్పలేదన్నారు. గుడ్లవల్లేరులో ఒక దళితునికి వైద్యపరంగా నష్టం జరిగితే తొలుత రూ. 5 లక్షలు ఇస్తామని మాటమార్చిన సమయంలో తాను అండగా నిలబడి బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు ఇప్పించానన్నారు. ఆ విషయంలో తాను మంత్రి హోదాలో ఉన్న కొడాలి నానీతో గట్టిగా వాదించానన్నారు. పట్టణంలోని 9వ వార్డులో గౌడ సామాజిక వర్గం యువతపై పోలీసులు అక్రమ కేసు పెడితే స్పందించాల్సిన టీడీపీ నాయకులు ఏమయ్యారన్నారు. ఈ ఐదేళ్లు మీరెందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అదేవిధంగా గత ఏడాది డిసెంబర్‌లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కార్యాలయంపై కొందరు దాడులకు పాల్పడితే వారిపై కేసు కట్టమని సూచించింది తానే అన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ముదినేపల్లి రూరల్: కలుషితమైన తాగునీటితో రోగాల బారిన పడుతున్నామని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలంటూ మహిళలు మండలంలోని వడాలి సెంటర్‌లో ముదినేపల్లి – బంటుమిల్లి రహదారిపై శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామంలో సరఫరా చేస్తున్న తాగునీరు పూర్తిగా కలుషితంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఆందోళనతో కొద్దిసేపు రోడ్డుకు ఇరువైపుల ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ గంగాధరరావు, ఈఓపీఆర్డీ లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. గ్రామంలో వారం రోజుల్లో బోర్లు వేసి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం అధికారులు తాగునీటి చెరువును పరిశీలించారు.



వడాలిలో తాగునీటి కోసం అధికారులను నిలదీస్తున్న మహిళలు

వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నిమ్మకూరు(పామర్రు): మండలంలోని నిమ్మకూరు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పంచాహ్నిక దీక్షతో కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తొలుత మూల స్వామివార్లకు స్నపనం, సర్వ దేవతాఆహ్వానం, అగ్నిప్రతిష్టాపన, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అనంతరం స్వామివార్లకు శేషవాహనంపై ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో పూజాదికాలను అర్చకులు పరాశరం యోగానంద లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజలను నిర్వహిస్తున్న అర్చకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కైకలూరు: బడి బయట పిల్లలను బడిలో చేర్పించి అందరికీ విద్య అందించాలని కలిదిండి మండలం అమరావతి గ్రామ సర్పంచ్ పి.భోగేశ్వరరావు, పీఎంసీ చైర్‌పర్సన్ వై.ఈశ్వరి కోరారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠ్య, నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. హెచ్ఎం ఏఎస్ఎస్ బెనర్జి, పాఠశాల సిబ్బంది ఎస్.ఝాన్సీ, టి.పాపాయమ్మ, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు నిమిత్తం పల్లెవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.రామకృష్ణ తెలిపారు. పల్లెవాడ, చినరామవరం, గోనెపాడు, శింగాపురం, లక్ష్మీనారాయణపురం, నత్తగుళ్లపాడు, చటాకాయి, భుజబలపట్నం, పెంచికలమర్రు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, లక్ష్మీపురం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, జంగంపాడు, వడ్లకూటితిప్ప, గోకర్ణపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

పిల్లలను తప్పనిసరిగా స్కూల్లో చేర్పించాలి

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో ఎంఈఓ–2 ఆధ్వర్యంలో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 రత్నసునాదం మాట్లాడుతూ ఐదేళ్ల బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా స్కూల్లో చేర్పించాలన్నారు. స్కూల్ మానేసిన పిల్లలను వారి యోగ్యతననుసరించి తిరిగి పాఠశాల్లో చేర్పించాలని కోరారు.

దాతల సాయంతో అన్నదానం

కైకలూరు: కైకలూరు తాలూకా సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని దాతల సాయంతో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా అన్న క్యాంటీన్ కార్యక్రమాన్ని అమలు చేసేవరకు దాతల సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జనసేన నేత కొల్లి బాబీ, తెలుగు యువత నేత పూల రాజీ తెలిపారు. శుక్రవారం నాటి అన్నదానానికి జనసేన నేత వర్రె హనుమ దాతగా వ్యవహరించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



నందివాడ: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని నందివాడ జెడ్పీ హైస్కూల్లో మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, సిగరెట్లు, మద్యం తదితర వాటికి యువత బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కె.ఏసుబాబు, ఎస్ఐ చంటిబాబు పాల్గొన్నారు.